రైతుల చూపు.. పొగాకు వైపు

- తక్కువ పెట్టబడితో మంచి లాభాలు
- మెట్టలో ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- రౌతులపూడి మండలంలో 500 ఎకరాల్లో సాగు

రౌతులపూడి: మెట్ట ప్రాంతమైన ప్రత్తిపాడు నియోజకవర్గంలో రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించారు. ఇప్పటికే పత్తి, అపరాలు, కూరగాయలు వంటి పంటలను సాగు చేసిన రైతులు ప్రస్తుతం వైట్ బర్లీ పొగాకు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గతేడాది మండలంలోని ఎ.మల్లవరంలో కొంత మంది రైతులు సుమారుగా 70 ఎకరాల్లో పొగాకు సాగుచేసి మంచి లాభాలు ఆర్జించారు. ఎకరానికి పెట్టుబడి రూ.50 వేలు పెడితే ఎకరానికి సుమారుగా 1.5 టన్నుల వరకూ దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు. ధర కూడా కిలో రూ.150 పలకడంతో రూ.2 లక్షల వరకూ ఆదాయం వస్తుంది. పెట్టుబడి పోనూ మంచి లాభాలు రావడంతో రైతుల్లో నమ్మకం కలిగింది. పొగాకు కొనుగోలు చేసే ఐటీసీ వంటి కంపెనీలు రైతులకు భరోసా కల్పిస్తున్నారు. దీంతో ఈ ఏడాది మండల వ్యాప్తంగా 500 ఎకరాల్లో పొగాకు సాగుకు రైతులు ఉపక్రమించారు. ఎ.మల్లవరంలోనే సుమారు 300 మంది రైతులు 350 ఎకరాల్లో పొగాకు సాగు చేపట్టినట్లు తెలుస్తోంది. మండలంలోని పారుపాక, కోడూరు, లచ్చిరెడ్డిపాలెం, ములగపూడి, రౌతులపూడి, గుమ్మరేగుల, ఎస్.పైడిపాల, అంపాడ గ్రామాలతో పాటు శంఖవరం మండలం గొంది, జి.కొత్తపల్లి, గైరంపేట, మండపం, తుని మండలంలోని లోవకొత్తూరు, వెలమ కొత్తూరు తదితర గ్రామాల్లోనూ మరో 150 ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.



ఎ.మల్లవరంలో రైతులు సాగు చేసిన పొగాకు పంట



పొగాకు మొక్కలు నాటిన పొలంలో కలుపు తీస్తున్న రైతు, కూలీలు



ఎ.మల్లవరంలోని పాకలో ఆరబెట్టిన పొగాకు

ఏడాదిలో ఎప్పుడైనా సాగు

వాతావరణం అనుకూలంగా ఉంటే ఏడాదిలో ఎప్పుడైనా పొగాకు సాగు చేయవచ్చు. సాగు ప్రారంభం నుంచి ఐదు నెలలు వరకు దిగుబడికి వస్తుంది. సాగు చేపట్టే రైతులు ముందుగా నీటివనరులు అందుబాటులో ఉంచుకోవాలి. నాట్లు వేశాక మొక్కలకు ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. మొక్కల సంరక్షణకు ఎప్పటికప్పుడు కలుపుతీత, గొప్పులు చేస్తారు. పంటకు అవసరమైన మేరకు నీరందిస్తారు. మొక్కలు పెరిగి ఉత్పత్తికి వచ్చిన తరువాత పొగాకు ఆరుదల కోసం పాకలు ఏర్పాటు చేస్తారు. ఆ పాకల్లో దండలుగా చేసి పొగాకును ఆరబెడతారు. ఆరిన పొగాకును గదుల్లో బద్రపరుస్తారు. క్వింటాల్ బరువు వచ్చేలా బేళ్లుగా మూటలు కట్టి అమ్మకాలు చేపడతారు.

రైతులకు 50 శాతం రాయితీ

వైట్ బర్లీ పొగాకు సాగు చేసే రైతులకు పలు కంపెనీల ప్రతినిధులు టార్పాలిన్లను 50 శాతం రాయితీతో అందిస్తున్నారు. కంపెనీ ఏజెంట్లు రాజమహేంద్రవరం, కడియం, కడియపులంక వంటి మైదాన ప్రాంతాల్లో నారుమడులు తయారు చేసి నారును పెట్టుబడిగా రైతులకు సరఫరా చేస్తారు. మొక్కలు నాటిన తరువాత ఏపుగా పెరిగేందుకు ఎరువులు, పురుగు మందులను అందజేస్తున్నారు. ఇలా నారు, ఎరువులు, పురుగు మందులు నిమిత్తం ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేలు వరకు ఖర్చవుతుంది. దుక్కులు, నీటివనరులు, మొక్కల సంరక్షణకు మరో రూ.20 వేలు వెరసి మొత్తం రూ.50 వేలు వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుదని రైతులు తెలిపారు. వాతావరణం అనుకూలించి అనుకున్న స్థాయిలో దిగుబడి వస్తే ఈ ఏడాది కూడా ఎకరానికి రూ.2 లక్షలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు సాగు లాభదాయకం



పెట్టుబడితో పాటు కష్టపడితే పొగాకు సాగు మంచి లాభదాయకం. గతేడాది 1.30 ఎకరాల భూమిలో వైట్ బర్లీ పొగాకు సాగు చేశాను. రూ.80 వేలు నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాను. దిగుబడి సుమారుగా 24 క్వింటాళ్లు వచ్చింది. ధర రూ.150 వరకు పలికి మొత్తంగా రూ.3.60 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కూడా 1.80 ఎకరాల్లో పొగాకు సాగు చేపట్టాను. వాతావరణం అనుకూలించి మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాను.

నాకిరెడ్డి అప్పలనాయుడు, రైతు, ఎ.మల్లవరం, రౌతులపూడి మండలం

మూడు ఎకరాల్లో సాగు చేశాను



మంచి ఆదాయం వస్తుందని భావించి ఈ ఏడాది కొత్తగా పొగాకు సాగు చేపట్టాను. మాకు ఉన్న రెండు ఎకరాలతో పాటు మరో ఎకరం కౌలుకు తీసుకుని మొత్తంగా మూడు ఎకరాల్లో పొగాకు సాగు చేపట్టాను. ఇప్పటి వరకు మూడు ఎకరాలకు నారు, ఎరువులు, పురుగు మందులు, భూమిని సదును చేయడం, కలుపుతీత తదితర పనులకు రూ.1.50 లక్షలు వరకు పెట్టుబడి పెట్టాను. ఏ మేరకు దిగుబడి వస్తోందో చూడాలి.

శెట్టి జోగిరాజు, రైతు, ఎ.మల్లవరం, రౌతులపూడి మండలం

క్లుప్తంగా

రహదారి భద్రత అందరి బాధ్యత



రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేస్తున్న హైవే మెయింటినెన్స్ యార్డు సిబ్బంది

ప్రత్తిపాడు: రహదారి భద్రత కేవలం వాహన చోదకులదే కాదని, ప్రజలందరూ బాధ్యతగా గుర్తించాలని హైవే మెయింటినెన్స్ యార్డు సీనియర్ మేనేజర్ అశోక్ కుమార్ రౌల్ అన్నారు. ప్రత్తిపాడు జాతీయ రహదారిపై సోమవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హైవే సిబ్బందికి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరించారు. రహదారిపై వాహన చోదకులే కాకుండా ప్రజలు కూడా పయనిస్తారని, వారు కూడా రోడ్డు నియమాలు పాటించాలని కోరారు. అనంతరం యార్డు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యార్డు మేనేజర్ ఎం.రాజా తదితరులు పాల్గొన్నారు.

‘చదలవాడ’కు ద్వారంపూడి పరామర్శ



చదలవాడ చిన్నాదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కిర్లంపూడి: స్థానిక సొసైటీ మాజీ అధ్యక్షుడు చదలవాడ బాబీని సోమవారం కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పరామర్శించారు. బాబీ తల్లి చిన్నాదేవి ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందారు. దీంతో కిర్లంపూడిలో ఆయన నివాసానికి వెళ్లి చిన్నాదేవి చిత్రపటానికి నివాళులర్పించారు. బాబీ కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు తుని ఆర్టీసీ డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రజలు 73827 81490 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.

గ్రీవెన్స్‌కు రెండు ఫిర్యాదులు

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు రెండు ఫిర్యాదులు అందినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. రెవెన్యూ సమస్యపై ఒకటి, విద్యుత్‌కు సంబంధించి మరో ఫిర్యాదు వచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్. శ్రీనివాసరావు, ఏఓ సద్గురుమూర్తి, ఏపీఓ ఆర్.గంగాభవాని, పశువైద్యాధికారి ఎ.సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి చేయూత

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న బంధం చిన్నారావును వ్యాపారవేత్త రెడ్డి అమర్నాథ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. అనంతరం రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తానని భరోసా ఇచ్చారు.

రామాలయానికి రూ.3.04 లక్షల మంజూరు



శ్రీవాణి ట్రస్ట్ నిధులు మంజూరు చేస్తూ జారీ చేసిన పత్రాన్ని గ్రామస్తులకు అందజేస్తున్న యనమల

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం శివారు గెడ్లబీడులో శిథిలవస్థలో ఉన్న రామాలయం పునర్నిర్మాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ స్కీమ్ నుంచి రూ.3,04,605 మంజూరయ్యాయి. సోమవారం తేటగుంటలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు ఆలయ కమిటీ సభ్యులకు శ్రీవాణి ట్రస్ట్ స్కీమ్ జారీ చేసిన నిధులు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే యనమల దివ్య సిఫార్సుతో మంజూరైన నిధులతో త్వరితగతిన ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని రామకృష్ణుడు సభ్యులకు సూచించారు. కె.అర్జున్, కె.సత్యనారాయణ, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంఖవరం మండలం సిద్దువారిపాలెంలో సారా బట్టీలపై ఎక్సైజ్ సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

అన్నవరం: స్థానిక సత్యదేవ హైస్కూల్‌లో సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు సద్గురు త్యాగరాజ చిత్రపటంతో గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. 10 గంటలకు నాదస్వర విద్వాంసులు పంచరత్న సేవ నిర్వహించారు. కాకినాడకు చెందిన విద్యాధరి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అధ్యాపకురాలు జి.అరుణ, తన శిష్యబృందంతో కలిసి త్యాగరాజ కృతులు ఆలపించారు. సాయంత్రం 5 గంటలకు గాత్ర విద్వాంసురాలు జి.అరుణ, విజయనగరానికి చెందిన వయోలిన్ విద్వాంసులు హెచ్.రామ్‌చరణ్, మృదంగం విద్వాంసులు ఎం.ఏడు కొండలు త్యాగరాజ కృతులు ఆలపించారు. ప్రముఖ కళాకారులు పి.సతీష్ కుమార్, ఎస్.చందు, వి.శ్రీను, ఎస్ఎం అప్పారావు, ఎం.దుర్గాప్రసాద్, పి.హనుమంతు తదితరులు తమ ప్రతిభను ప్రదర్శించారని సత్యదేవ సద్గురు త్యాగరాజా ఆరాధన కమిటీ గౌరవ అధ్యక్షుడు పాములూరి లక్ష్మణరావు, దేవస్థానం ఆస్థాన గాత్ర విద్వాంసులు పెండ్యాల సత్యం తెలిపారు.



త్యాగరాజ కృతులను గానం చేస్తున్న గాత్ర విద్వాంసురాలు అరుణ

బెంగళూరు విద్వాంసులకు సత్కారం

త్యాగరాజ ఆరాధనోత్సవాలకు బెంగళూరు నుంచి వచ్చిన శ్రీకంచి కామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులు, తత్తనూరు బ్రదర్స్ టీఎం వెంకటేష్, టీఎం మునిరాజ్, తవిల్ విద్వాన్, లంక ఆర్‌వీఎస్ శ్రీకాంత్, కందుకూరు కేఎం మనోహర్‌లను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఆన్‌లైన్ ద్వారా సర్వీస్ ప్రొవైడర్లకు ఉపాధి

ఏలేశ్వరం: ఆన్‌లైన్ ద్వారా సర్వీస్ ప్రొవైడర్లు ఉపాధి పొందవచ్చునని మున్సిపాల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం మెప్మా ఆధ్వర్యంలో సర్వీసు ప్రోవెడర్లకు (ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, తాపీ మేస్త్రిలు తదితర చేతి వృత్తుల వారు) ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వీసు ప్రొవైడర్లందరినీ ఆన్‌లైన్ చేస్తున్నట్టు తెలిపారు. దీని ద్వారా వీరికి నెలకు రూ.20 వేల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. వీరంతా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, మెప్మా టీఎంసీ సాయి కుమార్, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, ఎండగండి నాగబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

నేడు ఉపాధి హామీ పథకం సమన్వయ సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్‌జీఎస్) సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల శాఖ ద్వారా జరిగిన పనుల రికార్డులను సామాజిక తనిఖీబృంద సభ్యులు తనిఖీ చేస్తారన్నారు. అనంతరం పని ప్రాంతాలకు వెళ్లి పనులు పరిశీలించి వివరాలు నమోదు చేస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఇతర అధికారులు నిర్ణీత సమయానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ములగపూడిలో తాటాకిల్లు దగ్ధం

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన నీలి చిమ్మయ్య ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఫర్నిచర్, దుస్తులు, వంట సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిబూడిదయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ నరేష్, స్థానిక వీఆర్ఓ ఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. ప్రమాద బాధితులను ఆదుకుంటామని తహసీల్దార్ తెలిపారు. బాధిత కుటుంబానికి సర్పంచ్ తమరాన సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు వై.సురేష్, బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్ తదితరులు తమ వంతు సహకారం అందించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



ధర్మవరంలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వెటర్నరీ డాక్టర్

ప్రత్తిపాడు రూరల్: పశువులు వ్యాధుల బారిన పడకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి ఎస్.వరలక్ష్మి సూచించారు. మండలంలో ధర్మవరం, చింతలూరు తదితర గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశు యాజమాన్య పద్ధతులు, పశు విజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి వరలక్ష్మి మాట్లాడుతూ 204 పశువులకు చికిత్సను అందించామన్నారు. వంద గేదెలు, ఆవులకు నట్టల నివారణ చికిత్స అందించినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 103 మంది పాడి రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ జువ్వల బాబులు, బీజేపీ మండల అధ్యక్షుడు ఊట వీరబాబు, గ్రామ పెద్దలు దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గండేపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి ఎ.సుప్రియ సూచించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం గండేపల్లిలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పశువులకు వ్యాధులు రాకుండా టీకాలు వేశారు. పశువుల సంరక్షణపై పాడి రైతులకు పలు సూచనలు చేశారు. కాగా మంగళవారం మురారి, సూరంపాలెం, 22న ఉప్పలపాడు, 23న ఎర్రీ రాజాపురం, యర్రంపాలెం, 24న మల్లేపల్లి, 25న తాళ్లూరు, యల్లమిల్లి, 27న సింగరంపాలెం, 28న నీలాద్రిరావుపేట, 29న జెడ్ రాగంపేట గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

రౌతులపూడి: మండలంలోని ఎస్ఎన్ పట్నం, ములగపూడి గ్రామాల్లో సోమవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి ఎం.వీరాఘవరావు ఆధ్వర్యంలో పశువులకు నట్టల నివారణ టీకాలు వేశారు. జబ్బుపడిన పశువులకు చికిత్స చేశారు. అనంతరం పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. పశు సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్వారీ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి -పెద శంకర్లపూడి గ్రామాల మధ్య క్వారీ లారీలను సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. క్వారీల నుంచి నిర్ణీత లోడుకు మించి నల్లరాయి, తెల్లరాయిలను రవాణా చేయడంలో రాళ్లు రోడ్డుపై పడుతున్నాయన్నారు. కంకర రాళ్లు పడి రోడ్లు ఛిద్రం కావడంతో పాటు రహదారులు రాళ్ల గుట్టలుగా తయారవుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. దీంతో ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రవాణా సమయంలో రోడ్డుపై పడిన కంకర రాళ్లను క్వారీ యజమాన్యమే తొలగించాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం



ధర్మవరంలో జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరంలో ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో విజేతలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు నగదు, షీల్డ్‌ను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డిప్యూటీ సీఎం పదవిపై బహిరంగ ప్రకటనలు చేయడం సరికాదు

జగ్గంపేట: కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ ఆ పదవికి వన్నె తెచ్చారని, ఈ నేపథ్యంలో లోకేష్‌కు డిప్యూటీ సీఎం ఇవ్వాలని టీడీపీ నేతలు బహిరంగ ప్రకటనలు చేయడం సరికాదని జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ఈ మేరకు జగ్గంపేటలో సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ నేతలు చేస్తున్న బహిరంగ ప్రకటనలపై అసహనం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్నో త్యాగాలు చేశారన్నారు. కూటమి నేతలు కలిసి కట్టుగా పనిచేయాలంటే టీడీపీ నేతలు ఈ ప్రచారాన్ని తక్షణమే ఆపాలని కోరారు.

గ్రామీణ ప్రజలకు బ్యాంక్ సేవలు

ప్రత్తిపాడు రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో బ్యాంకు సేవలు అందించడమే లక్ష్యమని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. 8 జిల్లాల్లో 275 శాఖల ద్వారా సేవలు అందిస్తుందన్నారు. ఒమ్మంగిలో 276వ శాఖను నూతనంగా ప్రారంభించామన్నారు. గత డిసెంబర్ నాటికి డిపాజిట్లు రూ.11,154 కోట్లు సేకరించి, రుణాలు 13,655 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఖాతాదారులు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు యస్.నరేంద్ర, యల్.మనోజ్ విహారి తదితరులు పాల్గొన్నారు.



ఒమ్మంగిలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డి

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు కురాకుల రాజా ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పులక్ష్మీపురంలో శ్మశాన వాటిక లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నీలి సురేష్, ఉపాధ్యక్షుడు పతివాడ వెంకటేశ్వరరావు, బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

‘ఆవాస్ యోజన’ను సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజనను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు కోరారు. గోకవరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాలు చేపట్టడానికి దరఖాస్తులు ప్రారంభమయ్యాయని, అర్హులంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, నాయకులు వరసాల ప్రసాద్, సత్తి వెంకటరెడ్డి, ఉంగరాల ఆదివిష్ణు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

రూ. 70 వేల నగదు, ఇత్తడి సామగ్రి స్వాధీనం

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి, చినశంకర్లపూడి గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను ప్రత్తిపాడు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.70 వేల నగదు, ఇత్తడి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై ఎస్. లక్ష్మీకాంతం కథనం మేరకు ఒమ్మంగి, చినశంకర్లపూడి గ్రామాల్లో జరిగిన కన్నపు చోరీల్లో ప్రధాన నిందుతులైన ప్రత్తిపాడు తోట వీధికి చెందిన కావడి మారెమ్మ, కావడి శివలను స్థానిక తోటవీధి సాయిబాబు ఆలయం వద్ద సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. మధ్యవర్తుల సమక్షంలో వీరి నుంచి రూ. 70 వేల నగదు, ఇత్తడి సామాన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గతంలో కూడా ఇటువంటి నేరాలకు పాల్పడ్డారని ఎస్సై లక్ష్మీకాంతం చెప్పారు. గ్రామాల్లోని వీధుల్లో పాత వాటర్ బాటిళ్లు, పాత కాగితాలు ఏరుకుంటూ రెక్కీ నిర్వహించేవారు. తాళాలు వేసిన ఇళ్లల్లోకి తాళాలు బద్దలుకొట్టుకొని చొరబడి, విలువైన బంగారు, వెండి, ఇత్తడి సామాన్లు, నగదు దొంగిలించి, నేరాలను పాల్పడుతున్నారన్నారు. నిందితులపై పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదైయ్యాయని చెప్పారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు.

అన్నవరంలో భజన బృందాలకు అవకాశం కల్పించాలి

తుని రూరల్: అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో భజనలు చేసేందుకు అవకాశం కల్పించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడిని భజన బృందాల సభ్యులు కోరారు. సోమవారం తేటగుంటలోని క్యాంపు కార్యాలయంలో ఉన్న యనమలను విశ్వనంద భారతీస్వామి ఆధ్వర్యంలో భజన బృందాల సభ్యులు కలిశారు. ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానంలో పాలకమండలి అనుమతితో కళాకారులు నిత్య భజనలు చేస్తున్నారన్నారు. అదే మాదిరిగా అన్నవరంలోనూ భజనలు చేసేందుకు భజన బృందాలకు అవకాశం కల్పించాలన్నారు. దేవదాయశాఖ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళతానని యనమల తెలిపారు. కార్యక్రమంలో భజన కళాకారులు నూకరాజు, పైల అప్పలనాయుడు, సూర్యనారాయణ, అడ్డెపల్లి రాజా, సిద్దా పెద్దిరాజు, గంట్ల శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదంలో నష్టపోయిన అడ్డాల నూకరాజుకు రూ.ఐదు వేలు, అడ్డాల రాజబాబుకు రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయ దుర్గ రవికుమార్, ఎంపీటీసీ ఈగల చిన్నమ్మలు, మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

‘ఆదిత్య’లో 3న సామూహిక అక్షరాభ్యాసం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని సరస్వతి నిలయంలో ఫిబ్రవరి 3న సామూహిక అక్షరభ్యాసం నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి సోమవారం తెలిపారు. వసంత పంచమి, సరస్వతీదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలవారు 77318 86664 నంబర్‌ను సంప్రదించాలన్నారు.